

RNI No: APTEL/2018/76747

# నవతరం

DYNAMIC EDITION తెలుగు దినపత్రిక

| హైదరాబాద్ | ఆదివారం | సంపుటి: 9 | సంచిక: 234 | పేజీలు: 05 | వెల: 5 /- | 23 ఆగస్టు 2026 |

## ప్రజలకు ఫ్లోరైడ్ రహిత సరఫరా..

# ప్రభుత్వ ఆశయానికి సమాధి కట్టిన మున్సిపాలిటీ

- సుజలాం ఆర్.ఓ. ప్లాంట్‌లో కళ్లు బైర్లు కమ్మే అక్రమాలు.. ఏజెన్సీ చట్టాలకు, జీఓకు ఘోర ఉల్లంఘన
- వైఎస్సార్ కాలంలో ఎస్టీలకు దక్కాల్సిన లీజ ఓసీ వ్యక్తికి.. 16 ఏళ్లుగా సాగుతున్న అక్రమ వ్యాపార సామ్రాజ్యం
- రూ. 1, రూ. 2 కి ఇవ్వాల్సిన శుద్ధజలం రూ. 10 కి విక్రయం.. కూలింగ్ వాటర్ పేరిట రూ. 30 నుండి రూ. 40 వసూలు
- ప్రభుత్వ స్థలం, ఉచిత బోర్ నీటితో ఫంక్షన్లకు, దుకాణాలకు వాటర్ సప్లై దందా.. ఆటోల్లో అక్రమ రవాణా
- ఆర్.ఓ. ప్లాంట్ ఆవరణలో ఆక్వేరియం చేపల వ్యాపారం.. ప్రభుత్వ సొత్తుతో నిర్వాహకుడి కోట్ల సంపాదన
- కమిషనర్, అధికారుల మామూళ్ల మత్తు? కోర్టులో కౌంటర్ వేయకుండా మున్సిపాలిటీ రాజీ మార్గం





**నవతరం ప్రతినిధి, ఖమ్మం భద్రాద్రి జిల్లా:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా,ఏజెన్సీ నియోజకవర్గమైన అశ్వారావుపేటలోని ఆర్ డబ్ల్యు ఎస్ కార్యాలయం వద్ద ఉన్న 'సుజలాం' ఆర్.ఓ. వాటర్ ప్లాంట్ అక్రమాలకు, అధికారుల అవినీతికి నిలువుటద్దంగా మారింది. దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి పరిపాలనా కాలంలో, నాటి ఎమ్మెల్యే మిత్రసేన హయాంలో ఫ్లోరైడ్ రహిత శుద్ధ తాగునీటిని ప్రజలకు అందించాలనే ప్రభుత్వ ఆశయానికి ఇక్కడ పూర్తిగా సమాధి కట్టారు.

**రూ. 1 పోయి.. రూ. 10 దందా: కూలింగ్ వాటర్ పేరిట మరో దోపిడీ!**

ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఎస్టీలకు ₹1, బీసీ/ఓసీలకు ₹2 చొప్పున 20 లీటర్ల క్యాన్ నీరు ఇవ్వాలి. తదనంతరం విద్యుత్ ఛార్జీల పెంపు నెపంతో పంచాయతీ ద్వారా ₹2 నుండి గరిష్టంగా ₹4 వరకు అమ్ముకోవడానికి అనుమతిని ఇచ్చారు. కానీ నిర్వాహకుడు సామాన్య ప్రజల నుండి ఏకంగా ₹10 వసూలు చేస్తూ దోపిడీకి దిగారు. దీనికి తోడు నిబంధనల్లో లేకపోయినా, ప్లాంట్‌లో కూలింగ్ వాటర్ తయారు చేస్తూ ఒక్కో క్యాన్‌ను ₹30 నుండి ₹40 వరకు విక్రయిస్తూ అక్రమ అర్జనకు తెరతీశారు.

**వ్యాపార దందా – ఫంక్షన్లకు, షాపులకు అక్రమ రవాణా!**

ప్లాంట్ ఉద్దేశం ప్రకారం నీరు తీసుకెళ్లే స్థానిక ప్రజల పేర్లు, ఫోన్ నంబర్లు రిజిస్టర్‌లో నమోదు చేసి ఒకటి లేదా రెండు క్యాన్లు చొప్పున మాత్రమే ఇవ్వాలి. కానీ ఇక్కడ ఎలాంటి రికార్డులు నిర్వహించకుండా, ఆటోల ద్వారా పెళ్లిళ్లకు, ఫంక్షన్లకు, ఇతర వ్యాపార షాపులకు బల్క్‌గా నీటిని విక్రయిస్తూ బ్లాక్ మార్కెట్ నడుపుతున్నారు. ఇక్కడితో ఆగకుండా ప్రభుత్వ ఆర్.ఓ. ప్లాంట్ ఆవరణలోనే ఆక్వేరియంలు ఏర్పాటు చేసి చేపల వ్యాపారం నడుపుతూ ప్రభుత్వ ఆస్తిని సొంత లాభదేవలకు వాడుకుంటున్నారు.

**అధికారుల 'మామూళ్ల' మత్తు – మున్సిపాలిటీ కౌంటర్ ఏది?**

గతంలో గ్రామపంచాయతీ అధికారులు, గత రెండేళ్లుగా మున్సిపాలిటీగా రూపాంతరం చెందిన తర్వాత మున్సిపల్ కమిషనర్ మరియు ఇతర యంత్రాంగం ఈ నిర్వాహకుడి వద్ద 'మామూళ్లు' పుచ్చుకుని నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారనే తీవ్ర ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. హైకోర్టులోని తాత్కాలిక స్టేను ఎత్తివేయడానికి మున్సిపల్ అధికారులు నేటికీ కోర్టులో బలమైన కౌంటర్ దాఖలు చేయకపోవడం వెనుక ఈ అంతర్గత కుమ్మక్కే ప్రధాన కారణమని స్పష్టమవుతోంది.

**ఏజెన్సీ చట్టాలకు పాతర – ఎస్టీలకు దక్కాల్సిన లీజ ఓసీకి.**

ఏజెన్సీ ప్రాంతమైన అశ్వారావుపేట గ్రామపంచాయతీ పరిధిలో నిబంధనల ప్రకారం ఈ ప్లాంట్ లీజును స్థానిక ఎస్టీ వర్గానికి కేటాయించాల్సి ఉంది. కానీ చట్టాలను, జీఓలను తుంగలో తొక్కి నాటి అధికారులు ఈ లీజును వినుకొండ శ్రీనివాసరావు అనే ఓసీ వ్యక్తులకు కట్టబెట్టారు. ప్రభుత్వ స్థలం, ప్రభుత్వ భవనం, ఉచిత బోర్ వాటర్.. కేవలం కరెంట్ బిల్లు మాత్రమే నిర్వాహకుడు చెల్లిస్తూ, ప్రజలకు సేవా దృక్పథంతో నీరందించాల్సిన ప్లాంట్‌ను సొంత వ్యాపార సామ్రాజ్యంగా మార్చుకున్నారు.

**డిమాండ్:**

16 ఏళ్లుగా ఏజెన్సీ చట్టాలను ధిక్కరిస్తూ, ప్రభుత్వ సొత్తుతో కోట్లు కొల్లగొట్టిన ఈ ఆర్.ఓ. ప్లాంట్ లీజును తక్షణమే రద్దు చేయాలి. మున్సిపల్ కమిషనర్ వెంటనే హైకోర్టులో కౌంటర్ దాఖలు చేసి ప్లాంట్‌ను స్వాధీనం చేసుకోవాలని, అక్రమాలకు సహకరిస్తున్న అధికారులపై జిల్లా కలెక్టర్ చర్యలు తీసుకోవాలని అశ్వారావుపేట ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## కాకినాడ నర్సింగ్ కాలేజీలో విద్యార్థినుల ఫైట్

# అధికారుల జోక్యంతో సద్దుమణిగిన గొడవ

- సెల్‌ఫోన్ పోయిందన్న ఫిర్యాదుతో మొదలైన వివాదం
- రోడ్డుపైకి వచ్చి దాడి చేసుకున్న ఏపీ, మణిపూర్ విద్యార్థినులు
- మణిపూర్ విద్యార్థినులను మరో హాస్టల్‌కు తరలింపు

కాకినాడ, నవతరం: ఓ సెల్‌ఫోన్ వ్యవహారం నర్సింగ్ విద్యార్థినుల మధ్య పెద్ద ఘర్షణకు దారితీసింది. కాకినాడలోని ఎస్‌కే కాలేజ్ ఆఫ్ నర్సింగ్‌లో చదువుకుంటున్న ఆంధ్రప్రదేశ్, మణిపూర్ రాష్ట్రాలకు చెందిన విద్యార్థినులు రోడ్డుపైకి వచ్చి పరస్పరం దాడులు చేసుకున్నారు. ఈ ఘటనలో పలువురికి గాయాలయ్యాయి. అధికారుల జోక్యంతో వివాదం సద్దుమణిగింది. వివరాల్లోకి వెళితే.. కళాశాల హాస్టల్‌లో ఉంటున్న మణిపూర్‌కు చెందిన ఓ విద్యార్థిని తన సెల్‌ఫోన్ కనిపించడం లేదని ఇటీవల సర్పవరం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆ తర్వాత ఫోన్ దొరికినప్పటికీ, ఈ విషయంపై విద్యార్థినుల మధ్య వివాదం సద్దుమణగలేదు. మాటామాటా పెరిగి పరిస్థితి తీవ్రరూపం దాల్చింది. రెండు వర్గాల విద్యార్థినులు హాస్టల్ నుంచి బయటకు వచ్చి రోడ్డుపైనే ఘర్షణకు దిగారు. ఒకరిపై ఒకరు దాడులు చేసుకోవడంతో అక్కడ ఉద్రిక్త వాతావరణం నెలకొంది.

ఈ దాడిలో పలువురు విద్యార్థినులకు స్వల్ప గాయాలవగా, ఇద్దరిని చికిత్స నిమిత్తం కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న పోలీసులు వెంటనే కళాశాల వద్దకు చేరుకున్నారు. ఆర్డీవో, ట్రైనీ జేసీ, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు కూడా సంఘటనా స్థలానికి వచ్చి విద్యార్థినులతో మాట్లాడారు. వారికి నచ్చజెప్పి పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. అధికారులు తక్షణ చర్యగా మణిపూర్‌కు చెందిన విద్యార్థినులను వేరే హాస్టల్‌కు తరలించారు. ఈ ఘటన నేపథ్యంలో అసలు కళాశాలకు సరైన అనుమతులు ఉన్నాయా, విద్యార్థులకు కల్పిస్తున్న వసతులు ఎలా ఉన్నాయి అనే కోణంలో అధికారులు విచారణ ప్రారంభించారు.



## అనిషా వలకు చిక్కిన

### ఎస్.ఐ బండేల బలరాజ్ & బొట్టా రాఘవేంద్ర కుమార్

**చందానగర్, నవతరం:** సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలోని చందానగర్ పోలీస్ స్టేషన్ ఎస్.ఐ బండేల బలరాజ్, కానిస్టేబుల్ (PC-7491) బి. రాఘవేంద్ర లను రంగారెడ్డి రేంజ్ ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. చందానగర్ పోలీస్ స్టేషన్ క్రైమ్ నంబర్ 696/2026 కేసు దర్యాప్తు మరియు ఛార్జ్ షీట్ దాఖలు చేసే అధికారిక పని కోసం ఫిర్యాదుదారుని నుండి రూ. 75,000 లంచం డిమాండ్ చేసి స్వీకరిస్తుండగా ఎస్.ఐ బండేల బలరాజ్ పట్టుబడ్డారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న అధికారి సూచన మేరకు, అతని కార్యాలయ టేబుల్ డ్రాయర్ నుండి రూ. 75,000 లంచం మొత్తాన్ని స్వాధీనం చేసుకున్నారు. బాలరాజ్ అప్పటికే రూ. 20,000 నగదును, అలాగే (కానిస్టేబుల్/రైటర్) బొట్టా రాఘవేంద్ర కుమార్ UPI చెల్లింపుల ద్వారా రూ. 10,000 లను స్వీకరించారు.

తద్వారా, ఈ అధికారులు అక్రమ ప్రయోజనం పొందేందుకు తమ విధులను అక్రమంగా మరియు నిజాయితీ లేకుండా నిర్వహించారు. అందువల్ల, ఈ అధికారులను అరెస్టు చేసి, జ్యుడీషియల్ రిమాండ్ కోసం హైదరాబాద్‌లోని SPE & ACB కేసుల గౌరవనీయ ప్రధాన ప్రత్యేక న్యాయమూర్తి ముందు హాజరుపరచనున్నారు. ఈ కేసు దర్యాప్తులో ఉంది. భద్రతా కారణాల దృష్ట్యా ఫిర్యాదుదారు వివరాలు గోప్యంగా ఉంచబడ్డాయి.

**సెల్ ఫోన్ నంబర్ - 1064 (టోల్ ఫ్రీ నంబర్)**

ఏదైనా ప్రభుత్వ ఉద్యోగి లంచం డిమాండ్ చేస్తే, చట్టపరమైన చర్యల కోసం ప్రజలు ఏసీబీ టోల్ ఫ్రీ నంబర్ 1064ను సంప్రదించాలని కోరడమైనది. అలాగే వాట్సాప్ (9440446106), ఫేస్‌బుక్ (Telangana ACB), X/ట్విట్టర్ (@Telangana ACB) వంటి సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌ల ద్వారా కూడా తెలంగాణ ఏసీబీని సంప్రదించవచ్చు. తెలంగాణ ఏసీబీని సంప్రదించడానికి వీలుగా అన్ని ప్రభుత్వ కార్యాలయాలు మరియు ప్రముఖ బహిరంగ ప్రదేశాలలో ఏసీబీ క్యూఆర్ (QR) కోడ్ ప్రదర్శించబడింది. బాధితుడు/ఫిర్యాదుదారుని పేరు మరియు వివరాలు గోప్యంగా ఉంచబడతాయి.





## విద్యా హబ్‌గా హైదరాబాద్..

# కేంబ్రిడ్జ్, లండన్ వర్సిటీలకు రేవంత్ ఆహ్వానం

- లండన్ యూనివర్సిటీని సందర్శించిన సీఎం రేవంత్ రెడ్డి
- హైదరాబాద్‌లో క్యాంపస్ ఏర్పాటుపై లండన్ వర్సిటీ సానుకూలత
- కేంబ్రిడ్జ్ వర్సిటీ ప్రతినిధులతోనూ సీఎం బృందం చర్చలు
- హైదరాబాద్‌ను గ్లోబల్ నాలెడ్జ్ హబ్‌గా మార్చడమే లక్ష్యం
- తెలంగాణతో కలిసి పనిచేసేందుకు కేంబ్రిడ్జ్ ప్రొఫెసర్ల ఆసక్తి




హైదరాబాద్, నవతరం: తెలంగాణకు అంతర్జాతీయ స్థాయి విద్యాసంస్థలను ఆకర్షించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లండన్‌లో పర్యటిస్తున్నారు. ఈ పర్యటనలో భాగంగా ముఖ్యమంత్రితో పాటు మంత్రి శ్రీధర్ బాబు నేతృత్వంలోని బృందం 'లండన్ యూనివర్సిటీ'ని సందర్శించింది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో తమ క్యాంపస్‌ను ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలిస్తున్నట్లు విశ్వవిద్యాలయ ప్రతినిధులు వెల్లడించారు. తెలంగాణలో ఉన్న అనుకూలతలు, విద్యా రంగంలో ఉన్న అవకాశాలను సీఎం బృందం వారికి వివరించింది.

అంతకుముందు రేవంత్ రెడ్డి బృందం కేంబ్రిడ్జ్ విశ్వవిద్యాలయ ప్రతినిధులతో సమావేశమై విద్య, పరిశోధన రంగాల్లో పరస్పర భాగస్వామ్య అవకాశాలపై చర్చించింది. హైదరాబాద్‌లో తమ క్యాంపస్‌ను ఏర్పాటు చేసి, ఉన్నత ప్రమాణాలతో కూడిన విద్యా కోర్సులను, పరిశోధనా కార్యక్రమాలను అందుబాటులోకి తీసుకురావాలని సీఎం కోరారు. ప్రపంచస్థాయి అత్యుత్తమ విద్యాసంస్థలకు హైదరాబాద్ ప్రధాన గమ్యస్థానంగా మారుతోందని ఈ సందర్భంగా ఆయన వివరించారు.

ఈ పర్యటనలో భాగంగా కేంబ్రిడ్జ్ జడ్జ్ బిజినెస్ స్కూల్‌కు చెందిన ప్రొఫెసర్లు జయదీప్ ప్రభు, వెంకట శిరీష్ గండికోట.. తెలంగాణ ప్రభుత్వంతో కలిసి పనిచేసేందుకు ఆసక్తి వ్యక్తం చేశారు. హైదరాబాద్‌ను అంతర్జాతీయ విజ్ఞాన కేంద్రంగా (గ్లోబల్ నాలెడ్జ్ హబ్) తీర్చిదిద్దాలన్న ప్రభుత్వ లక్ష్యంలో భాగస్వాములు కావాలని సీఎం రేవంత్ రెడ్డి ఈ విద్యాసంస్థలను ఆహ్వానించారు.

# నాలుగు దశాబ్దాలుగా పరారీ..

## ఎట్టకేలకు పట్టుబడ్డ హత్య కేసు నిందితుడు

దాదాపు నాలుగు దశాబ్దాలుగా పోలీసుల కళ్లుగప్పి తప్పించుకుని తిరుగుతున్న ఓ హత్య కేసు నిందితుడిని ఎట్టకేలకు ముంబై పోలీసులు అరెస్ట్ చేశారు. సురేశ్ చందర్ అడగాలే (59) అనే వ్యక్తిని పుణే జిల్లాలోని రంజన్‌గావ్‌లో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ అరెస్ట్‌తో 40 ఏళ్ల నాటి కేసులో పురోగతి లభించినట్లయింది.

సురేశ్‌కు 19 ఏళ్ల వయసు ఉన్నప్పుడు ఒక హత్య కేసులో ముంబై పోలీసులు అతడిని అరెస్ట్ చేశారు. అయితే, విచారణ సమయంలో న్యాయస్థానం అతడికి బెయిల్ మంజూరు చేసింది. బెయిల్‌పై బయటకు వచ్చిన సురేశ్, ఆ తర్వాత కోర్టు విచారణకు హాజరుకాకుండా పరారయ్యాడు. అప్పటి నుంచి అజ్ఞాతంలోకి వెళ్లిపోయిన అతడిపై కోర్టు నాన్-బెయిలబుల్ వారెంట్ జారీ చేసినప్పటికీ, దాదాపు 40 ఏళ్లుగా పోలీసులకు చిక్కకుండా తప్పించుకుని తిరుగుతున్నాడు.

దీర్ఘకాలంగా పరారీలో ఉన్న నిందితులను పట్టుకునేందుకు ముంబై పోలీసులు చేపట్టిన ప్రత్యేక గాలింపు చర్యల్లో భాగంగా, సాకినాకా పోలీస్ స్టేషన్ బృందం ఈ కేసును తిరిగి దర్యాప్తు చేసింది. సాంకేతిక పరిజ్ఞానం, విశ్వసనీయ వర్గాల నుంచి అందిన సమాచారంతో నిందితుడు తన అసలు గుర్తింపును దాచుకుని పుణే జిల్లా, శిరూర్ తహసీల్ పరిధిలోని రంజన్‌గావ్‌లో నివసిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. పక్కా ప్రణాళికతో అక్కడికి చేరుకున్న పోలీసులు అతడిని అదుపులోకి తీసుకున్నారు. అనంతరం నిందితుడిని కోర్టు ఆదేశాల మేరకు తదుపరి చట్టపరమైన చర్యల నిమిత్తం తరలించారు.



# ప్రజాస్వామ్యానికి పత్రికా స్వేచ్ఛ అత్యవసరం

## తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

**హైదరాబాద్, నవతరం:** దేశవ్యాప్తంగా ఉన్న ఎనిమిది ప్రెస్ క్లబ్‌ల ప్రతినిధులను ఒకచోట చేర్చి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క హైదరాబాద్‌లో 'ఫెడరేషన్ ఆఫ్ ప్రెస్ క్లబ్స్'ను లాంఛనంగా ప్రారంభించారు. అధికారంలో ఉన్నవారిని జవాబుదారీగా ఉంచే స్వేచ్ఛాయుత, నిర్భయ పత్రికా స్వేచ్ఛ ప్రజాస్వామ్యానికి అత్యవసరమని, విమర్శలను స్వీకరించే ధైర్యం ప్రభుత్వాలకు ఉండాలని ఆయన అన్నారు. భారత స్వాతంత్ర్య ఉద్యమంలో పాత్రికేయ రంగం పోషించిన చారిత్రక పాత్రను భట్టి ప్రముఖంగా ప్రస్తావిస్తూ, మహాత్మా గాంధీ, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్, బాల్ గంగాధర్ తిలక్ తదితరులు చేసిన సేవలను గుర్తుచేసుకున్నారు. కార్టూనిస్ట్ శంకర్‌కు నెహ్రూ చెప్పిన ప్రసిద్ధ సందేశం –"నన్ను వదలొద్దు, శంకర్"–ను ఉటంకిస్తూ, వృత్తిపరమైన ప్రమాణాలకు రాజీ పడకుండా అధికారంలో ఉన్నవారిని ప్రశ్నించాలని ఆయన పాత్రికేయులను కోరారు. డిజిటల్, ఏఐ యుగంలో, ముఖ్యంగా తప్పుడు సమాచారం, డీప్‌ఫేక్‌లు వేగంగా వ్యాప్తి చెందుతున్న తరుణంలో, విశ్వసనీయతే పాత్రికేయ రంగానికి అతిపెద్ద ఆస్తి అని ఆయన నొక్కి చెప్పారు. పాత్రికేయుల, ముఖ్యంగా జిల్లాలు, గ్రామీణ ప్రాంతాల్లో పనిచేస్తున్న వారి భద్రత, గౌరవం, సంక్షేమాన్ని పరిరక్షించాలని కూడా భట్టి ఫెడరేషన్‌ను కోరారు. అధికారులు వినడానికి సిద్ధంగా ఉన్నప్పుడు, స్థానిక విలేకరులు ప్రభుత్వానికి "అత్యుత్తమ ముందస్తు హెచ్చరిక వ్యవస్థ"గా పనిచేస్తారని ఆయన అభివర్ణించారు. హల్ద్వానీలోని రామ్‌లీలా మైదాన్‌లో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే సమావేశం అనంతరం జరిగినట్లు వార్తలు వచ్చిన "శుద్ధి" ఆచారాన్ని ప్రస్తావిస్తూ, స్వాతంత్ర్యం వచ్చి దశాబ్దాలు గడిచినా వివక్ష కొనసాగడాన్ని ఆయన ప్రశ్నించారు. "అధికారంలో ఉన్నవారిని వదిలిపెట్టవద్దు. మమ్మల్ని జవాబుదారీగా ఉంచండి, కానీ వృత్తిపరమైన ప్రమాణాలపై ఎన్నడూ రాజీ పడకండి. అంతిమంగా, దాని ప్రయోజనం పౌరుడికే దక్కాలని" భట్టి అన్నారు.










## తెలంగాణలో పెట్టుబడి పెట్టండి

# తెలంగాణలో ఆవిష్కరణలు చేయండి

హైదరాబాద్, నవతరం: తెలంగాణ వ్యాప్తంగా పెట్టుబడులు పెట్టడానికి, నూతన ఆవిష్కరణలు చేయడానికి, ఉద్యోగాలు సృష్టించడానికి ప్రపంచ వ్యాపార సంస్థలకు మంత్రి ఉత్తమ కుమార్‌ఆహ్వానించారు. 2034 నాటికి 1 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థను, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థను లక్ష్యంగా పెట్టుకున్నట్లు రాష్ట్ర మంత్రి తెలిపారు. టెక్నాలజీ, లైఫ్ సైన్సెస్, నీటిపారుదల, ఫుడ్ ప్రాసెసింగ్ మరియు తయారీ రంగాలలో ఉన్న అవకాశాలను ఆయన ప్రముఖంగా ప్రస్తావించారు. నూతన ఆవిష్కరణల ఆధారిత, సమ్మిళిత మరియు సుస్థిర వృద్ధికి ప్రపంచంలోనే అత్యంత పోటీతత్వ గమ్యస్థానాలలో ఒకటిగా తెలంగాణ నిలుస్తోందని పేర్కొంటూ, ప్రపంచ పెట్టుబడిదారులు, పారిశ్రామికవేత్తలు మరియు టెక్నాలజీ దిగ్గజాలు తెలంగాణతో భాగస్వామ్యం కావాలని నీటిపారుదల, ఆహార మరియు పౌర సరఫరాల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి శనివారం ఆహ్వానించారు.

హైదరాబాద్‌లోని ఐటీసీ కోహినూరులో జరిగిన గ్లోబల్ బిజినెస్ ఎక్సలెన్స్ & లీడర్‌షిప్ కాన్‌క్లేవ్ 2026లో కీలకోపన్యాసం చేస్తూ, నైపుణ్యం కలిగిన ప్రతిభ, ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలు, పారిశ్రామిక స్ఫూర్తి మరియు వేగంగా, పారదర్శకంగా పెట్టుబడులను సులభతరం చేయడానికి కట్టుబడి ఉన్న ప్రభుత్వం వంటి శక్తివంతమైన కలయికను తెలంగాణ అందిస్తోందని ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. ఉపాధిని సృష్టించే, జ్ఞానాన్ని బదిలీ చేసే, సుస్థిర పరిశ్రమలను బలోపేతం చేసే, ప్రజల జీవితాలను మెరుగుపరిచే పెట్టుబడులను తెలంగాణ కోరుకుంటోందని, తద్వారా ప్రపంచానికి అవసరమైన పరిష్కారాలను "ఊహించి, అభివృద్ధి చేసి, అందించే" ప్రదేశంగా రాష్ట్రాన్ని తీర్చిదిద్దాలని ఉత్తమ్ అన్నారు. జాతీయ వృద్ధి రేటు 8 శాతంగా ఉండగా, 2025-26 నాటికి తెలంగాణ స్థూల దేశీయోత్పత్తి (GSDP) 10.7 శాతం నామమాత్ర వృద్ధితో సుమారు రూ. 17.82 లక్షల కోట్లుగా అంచనా వేయబడిందని ఆయన అన్నారు. ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి యొక్క 'తెలంగాణ రైజింగ్ 2047 విజన్' కింద, 2034 నాటికి రాష్ట్రం $1-ట్రిలియన్ ఆర్థిక వ్యవస్థగా, 2047 నాటికి $3-ట్రిలియన్ ఆర్థిక వ్యవస్థగా మారాలని లక్ష్యంగా పెట్టుకుందని ఆయన తెలిపారు. ఈ వ్యూహం మూడు పరస్పర అనుసంధాన ఆర్థిక ప్రాంతాల ద్వారా అభివృద్ధిని ఊహించింది – టెక్నాలజీ మరియు అధిక-విలువ పరిశ్రమలచే నడపబడే ప్రధాన పట్టణ ఆర్థిక వ్యవస్థను కవర్ చేసే 'క్యూఆర్ఈ' (CURE); పరి-పట్టణ తయారీ, లాజిస్టిక్స్ మరియు మౌలిక సదుపాయాలపై దృష్టి సారించే 'ప్యూర్' (PURE); మరియు వ్యవసాయం, ఆహార ప్రాసెసింగ్ మరియు గ్రామీణ సంస్థలను ప్రోత్సహించే 'రేర్' (RARE). "అభివృద్ధి హైదరాబాద్‌కే పరిమితం కాకూడదు. అది తెలంగాణలోని ప్రతి జిల్లాకు, ప్రతి పట్టణానికి, ప్రతి గ్రామానికి మరియు ప్రతి కుటుంబానికి చేరాలి," అని ఉత్తమ్ అన్నారు.

ఐటీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, ఫార్మాస్యూటికల్స్, బయోటెక్నాలజీ, లైఫ్ సైన్సెస్, గ్లోబల్ కెపాబిలిటీ సెంటర్లకు హైదరాబాద్ ఒక ప్రపంచ కేంద్రంగా ఆవిర్భవిస్తున్న విషయాన్ని హైలైట్ చేస్తూ, సెమీకండక్టర్లు, డేటా సెంటర్లు, సైబర్ సెక్యూరిటీ, ఏరోస్పేస్, రక్షణ, ఎలక్ట్రిక్ మొబిలిటీ, క్లీన్ ఎనర్జీ, అధునాతన తయారీ రంగాలలో భారీ పెట్టుబడి అవకాశాలు తెరుచుకుంటున్నాయని మంత్రి అన్నారు.

తన పోర్ట్‌ఫోలియోలను ప్రస్తావిస్తూ, నీరు, వ్యవసాయం, ఆహార భద్రత, పరిశ్రమల కలయిక మరో ప్రధాన పెట్టుబడి అవకాశాన్ని అందిస్తోందని ఉత్తమ్ అన్నారు. సమర్థవంతమైన నీటి నిర్వహణ కోసం శాటిలైట్ ఇమేజరీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డ్రోన్లు, సెన్సార్లు మరియు ప్రిడిక్టివ్ అనలిటిక్స్ వంటి సాంకేతికతలను తెలంగాణ స్వాగతించింది.

రైతులకు మెరుగైన రాబడిని అందించడంతో పాటు గ్రామీణ ఉపాధిని సృష్టించేందుకు, వ్యవసాయ ఉత్పత్తులను ఎక్కువగా తెలంగాణలోనే ప్రాసెస్ చేసి, బ్రాండింగ్ చేసి, మార్కెటింగ్ చేయాలని చెబుతూ, ఫుడ్ ప్రాసెసింగ్, కోల్డ్ చైన్లు, గిడ్డంగులు, వ్యవసాయ లాజిస్టిక్స్, ప్యాకేజింగ్ మరియు ఎగుమతులలో అధిక పెట్టుబడులు పెట్టాలని ఆయన పిలుపునిచ్చారు. హైదరాబాద్‌కు ఆవల వరంగల్, కరీంనగర్, ఖమ్మం, నిజామాబాద్, నల్గొండ మరియు మిగతా 3వ పేజీలో..









## అమెరికాకు సహకరిస్తే శత్రువులుగానే చూస్తాం

# దేశాలకు ఇరాన్ తీవ్ర హెచ్చరిక

తమపై అమెరికా సాగిస్తున్న ఆర్థిక యుద్ధంలో ఏ దేశమైనా పాలుపంచుకుంటే, ఆ దేశాన్ని కూడా తమ శత్రువుగానే పరిగణిస్తామని ఇరాన్ హెచ్చరికలు జారీ చేసింది. తమను ఒంటరిని చేసేందుకు అమెరికాతో కలిసే దేశాల ప్రయోజనాలపై దాడులు చేస్తామని, పొరుగు దేశాలు ఈ దిగ్బంధనంలో చేరితే హర్మూజ్ జలసంధి నుంచి ఒక్క చుక్క నూనె కూడా బయటకు వెళ్లకుండా అడ్డుకుంటామని స్పష్టం చేసింది.

ఇరాన్ సుప్రీం నేషనల్ సెక్యూరిటీ కౌన్సిల్ సెక్రటరీ మొహ్సెన్ రెజాయీ శనివారం ఓ ప్రభుత్వ టీవీ ఛానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఈ వ్యాఖ్యలు చేశారు. "అమెరికాకు సహకరించే



దేశాలతో తొలుత చర్చలు జరుపుతాం. ఈ వివాదానికి దూరంగా ఉండాలని కోరతాం. వారు మా మాట వినకపోతే, వారి ప్రయోజనాలపై దాడులు చేయడం తప్ప మాకు మరో మార్గం ఉండదు" అని ఆయన హెచ్చరించారు. ఏళ్ల తరబడిగా అమెరికా ఆంక్షలను ఎలా ఎదుర్కోవాలో, చమురు అమ్మకాలను ఎలా కొనసాగించాలో తమకు బాగా తెలుసని రెజాయీ ధీమా వ్యక్తం చేశారు.

ఇటీవల అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మాట్లాడుతూ.. ఇరాన్‌కు ఏ దేశమైనా ఆర్థికంగా జీవనాధారం కల్పిస్తే, మిగతా 3లో..

# సురేఖను ఈసారి కాపాడలేను

## టీపీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్

హైదరాబాద్, నవతరం: తెలంగాణ కాంగ్రెస్‌లో మంత్రి కొండా సురేఖ, ఆమె కుమార్తె సుస్మిత వ్యాఖ్యల వివాదం మరింత ముదురుతోంది. ఈ వ్యవహారంపై టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. గతంలో అవకాశం ఉన్నప్పుడు సురేఖను కాపాడానని, కానీ ఇప్పుడు ఆమెను కాపాడే పరిస్థితి లేదని తేల్చిచెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై కొండా సుస్మిత చేసిన వ్యాఖ్యలు పార్టీ లైన్ దాటాయని ఆయన స్పష్టం చేశారు.

నిజామాబాద్‌తో పాటు పలుచోట్ల మీడియాతో మాట్లాడిన మహేశ్ గౌడ్, సుస్మిత వ్యాఖ్యలను తీవ్రంగా పరిగణిస్తున్నామని తెలిపారు. పార్టీ క్రమశిక్షణను ఉల్లంఘించి మాట్లాడిన వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇప్పటికే మంత్రి కొండా సురేఖకు షోకాజ్ నోటీసులు జారీ చేశామని, ఆమె ఇచ్చే వివరణను బట్టి తదుపరి చర్యలు ఉంటాయని వివరించారు.

ఈ వ్యాఖ్యలు పార్టీకి, ప్రభుత్వానికి నష్టం కలిగించేలా ఉన్నాయని, వీటిని ఉపేక్షించేది లేదని అన్నారు. మరోవైపు, టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ అధ్యక్షుడు మల్లు రవి నేతృత్వంలో శనివారం గాంధీ భవన్‌లో సమావేశం జరిగింది. కొండా సురేఖ సమర్పించిన వివరణను కమిటీ పరిశీలించింది. కుమార్తె వ్యాఖ్యలు వ్యక్తిగతమని సురేఖ చెప్పినప్పటికీ, కమిటీ దానితో ఏకీభవించలేదు. మంత్రిగా ఉన్న సురేఖ ఆ వ్యాఖ్యలను ఖండించకపోవడం తప్పని అభిప్రాయపడింది. అయితే, తుది నిర్ణయం తీసుకోకుండా మరిన్ని సమావేశాలు నిర్వహించాలని నిర్ణయించింది.

ఇదే సమయంలో, మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుద్ధ్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు పార్టీ లైన్ దాటలేదని మహేశ్ గౌడ్ స్పష్టం చేయడం గమనార్హం. కేవలం సురేఖ కుమార్తె వ్యాఖ్యలపైనే పార్టీ తీవ్రంగా దృష్టి సారించినట్లు ఆయన మాటల ద్వారా వెల్లడైంది.



# డీవైఎఫ్ఐ చరిత్రలో తొలిసారి..

సీపీఎం అనుబంధ యువజన విభాగం 'డెమొక్రటిక్ యూత్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా' (డీవైఎఫ్ఐ) కేరళ విభాగం చరిత్రలో నూతన అధ్యాయం ఆవిష్కృతమైంది. సంస్థ రాష్ట్ర అధ్యక్షురాలిగా తొలిసారి ఒక మహిళా నేత ఎన్నికయ్యారు. త్రిశూర్‌లో జరిగిన 16వ రాష్ట్ర మహాసభలో చింతా జెరోమ్‌ను ఈ కీలక బాధ్యతలకు ఎంపిక చేశారు. ఈ విషయాన్ని డీవైఎఫ్ఐ అఖిల భారత అధ్యక్షుడు ఏ.ఏ. రహీం అధికారికంగా ప్రకటించారు.

నూతన కమిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా కల్లియాస్సేరి ఎమ్మెల్యే, ఎస్ఎఫ్ఐ మాజీ రాష్ట్ర కార్యదర్శి ఎం. విజిన్‌ను, కోశాధికారిగా ఆర్. రాహుల్‌ను నియమించారు. కొల్లాం జిల్లాకు చెందిన చింతా జెరోమ్.. ఎస్ఎఫ్ఐ ద్వారా రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించి అంచెలంచెలుగా ఎదిగారు. కేరళ విశ్వవిద్యాలయం నుంచి ఆంగ్ల సాహిత్యంలో డాక్టరేట్ పొందిన ఆమె, ప్రస్తుతం డీవైఎఫ్ఐ కేంద్ర కమిటీతో పాటు సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యురాలిగా కొనసాగుతున్నారు. గతంలో ఆమె డాక్టరేట్ థీసిస్, కొన్ని వ్యాఖ్యలపై వివాదాలు తలెత్తినప్పటికీ, పార్టీలో ఆమె ఎదుగుదల నిరంతరాయంగా సాగింది. మరోవైపు, తిరువనంత పురం మాజీ మేయర్ ఆర్య రాజేంద్రన్‌కు 25 మంది సభ్యులతో కూడిన రాష్ట్ర సెక్రటేరియట్‌లో చోటు దక్కింది. ఆమె భర్త, గత అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసిన మాజీ ఎమ్మెల్యే కే. సచిన్ దేవ్‌కు నూతన ఉపాధ్య క్షులలో ఒకరిగా అవకాశం కల్పించారు.



### తెలంగాణలో పెట్టుబడి పెట్టండి

2వ పేజీ తరువాయి.. మహబూబ్‌నగర్ వంటి అభివృద్ధి చెందుతున్న కేంద్రాలపై దృష్టి సారించాలని మంత్రి పరిశ్రమలను ఆహ్వానించారు. స్టార్టప్‌లను, గ్రామీణ ఆవిష్కర్తలను ప్రోత్సహిస్తున్నందుకు డాక్టర్ జె.ఎ. చౌదరిని, ఇంటర్నేషనల్ స్టార్టప్ ఫౌండేషన్‌ను ప్రశంసిస్తూ, వ్యాపార నైపుణ్యాన్ని కేవలం రాబడులు, విలువలతోనే కాకుండా, సృష్టించబడిన జీవనోపాధులు, పరిష్కరించబడిన సమస్యల ద్వారా కూడా కొలవాలని ఉత్తమ్ అన్నారు. ప్రభుత్వం పారదర్శకంగా, వృత్తిపరంగా, బాధ్యతాయుతంగా వ్యవహరించే దీర్ఘకాలిక భాగస్వామిగా పనిచేస్తుందని వ్యాపార నాయకులకు హామీ ఇస్తూ, "తెలంగాణకు రండి. తెలంగాణలో పెట్టుబడి పెట్టండి. తెలంగాణలో ఆవిష్కరణలు చేయండి" అని ఆయన అన్నారు.

### అమెరికాకు సహకరిస్తే శత్రువులుగానే చూస్తాం

2వ పేజీ తరువాయి.. వారిపై చరిత్రలో కనీవినీ ఎరుగని రీతిలో కఠినమైన ఆర్థిక చర్యలు తీసుకుంటామని ప్రకటించారు. దీనిని 'ఎకనామిక్ వార్‌ఫేర్'గా, 'ఎకనామిక్ డీ-డే'గా అభివర్ణిస్తూ ట్రంప్ తన సోషల్ మీడియా ఖాతాలో పోస్ట్ చేశారు. ట్రంప్ ప్రకటన నేపథ్యంలోనే ఇరాన్ నుంచి ఈ తీవ్ర స్పందన వచ్చింది. ఈ పరిణామాలపై ఇరాన్ విదేశాంగ మంత్రి సయ్యద్ అబ్బాస్ అరాఘ్చీ కూడా స్పందించారు. ఇరాన్‌పై అమెరికా ప్రయోగిస్తున్న అన్ని చర్యల్లాగే ఈ ఆర్థిక ఆపరేషన్ కూడా విఫలమవడం ఖాయమని అన్నారు. "'చరిత్రలోనే అత్యంత కఠినమైన ఆంక్షలు', 'గరిష్ఠ ఒత్తిడి' వంటి గత ప్రయత్నాలన్నీ విఫలమయ్యాయి. ఇప్పుడు చేపట్టిన చర్య కూడా అదే విధంగా విఫలమవుతుంది" అని ఆయన సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎక్స్'లో పేర్కొన్నారు.

కాగా, ఈ ప్రాంతంలో యుద్ధ వాతావరణాన్ని తగ్గించేందుకు జూన్‌లో అమెరికా-ఇరాన్ మధ్య ఒక అవగాహన ఒప్పందం కుదిరింది. అయితే, ఇరు దేశాల మధ్య మళ్లీ ఉద్రిక్తతలు పెరగడంతో తుది ఒప్పందంపై జరగాల్సిన చర్చల భవితవ్యం అగమ్యగోచరంగా మారింది.

# కన్నీళ్లు పెట్టించే మహారాష్ట్ర విషాదం..

## గంటలపాటు కుమారుడిని ప్రాధేయపడిన తల్లి

**శంభాజీనగర్, నవతరం:** మహారాష్ట్రలోని ఛత్రపతి శంభాజీనగర్‌లో కుమారుడిని ఆత్మహత్య నుంచి కాపాడే ప్రయత్నంలో తల్లిదండ్రులు కూడా ప్రాణాలు కోల్పోయిన హృదయవిదారక ఘటన చోటుచేసుకున్న విషయం తెలిసిందే. ఐఫోన్ ఈఎంఐ చెల్లింపునకు సంబంధించిన వివాదం ఆ కుటుంబంలోని ముగ్గురి ప్రాణాలను బలితీసుకుంది. తన కొడుకును ఆత్మహత్య చేసుకోవద్దని తల్లి ప్రాధేయపడటం, కాళ్లమీద కూర్చుని వేడుకోవడం వంటి దృశ్యాలు అందరినీ కలిచివేస్తున్నాయి.

ఝుల్తా గ్రామానికి చెందిన కునాల్ చంద్‌గుడే (19) అనే యువకుడు, ఐఫోన్ ఈఎంఐ చెల్లింపు విషయంలో తండ్రితో గొడవపడి, సమీపంలోని కొండపైకి వెళ్లి అంచున నిలబడ్డాడు. సమాచారం అందుకున్న తల్లి సంగీత గంటల తరబడి కొడుకును బతిమాలింది. నేలపై సాష్టాంగపడి, ఏ సమస్యనైనా పరిష్కరించుకుందామని, కిందకు రావాలని కన్నీటితో వేడుకుంది. పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది, గ్రామ సర్పంచ్ ఎంతగా నచ్చజెప్పినా కునాల్ తన నిర్ణయాన్ని మార్చుకోలేదు.

ఈ క్రమంలో తండ్రి మురళీధర్ తన కుమారుడిని అంచు నుంచి వెనక్కి లాగేందుకు ప్రయత్నించగా, ఇద్దరూ పట్టుతప్పి కొండపై నుంచి కింద పడిపోయారు. కళ్ల ముందే భర్త, కుమారుడు ప్రమాదానికి గురికావడంతో తీవ్ర దిగ్భ్రాంతికి లోనైన సంగీత, కొద్ది క్షణాల్లోనే వారి వెనుకే దూకి ప్రాణాలు విడిచింది.

ఈ ఘటనకు సంబంధించిన వీడియో ప్రస్తుతం వెలుగులోకి వచ్చింది. నాలుగు నెలల క్రితమే ఈ కుటుంబం ఇక్కడికి వచ్చిందని, స్థానికులతో పెద్దగా పరిచయాలు లేవని గ్రామస్తులు తెలిపారు. వారు నివసించిన ఇంట్లో పెంపుడు కుక్క ఇప్పటికీ కిటికీలోంచి యజమానుల కోసం ఎదురుచూస్తుండటం అందరినీ కన్నీరు పెట్టిస్తోంది.



# రేవంత్‌కు క్షమాపణ చెప్పాల్సిందే

# కొండా సురేఖకు ఎమ్మెల్యేల అల్టిమేటం

**హైదరాబాద్, నవతరం:** తెలంగాణ కాంగ్రెస్‌లో మంత్రి కొండా సురేఖ కుమార్తె సుస్మిత చేసిన వ్యాఖ్యల వివాదం మరింత ముదిరింది. సురేఖను మంత్రివర్గం నుంచి తొలగించాలని, ఆమె సీఎం రేవంత్ రెడ్డికి బహిరంగంగా క్షమాపణ చెప్పాలని 20 మందికి పైగా కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు డిమాండ్ చేశారు. కుటుంబ సభ్యులతో సీఎంపై విమర్శలు చేయించడం సంస్కార హీనమని, కూతురి వ్యాఖ్యలతో తనకు సంబంధం లేదని సురేఖ చెప్పడం కేవలం బుకాయింపు మాత్రమేనని వారు విమర్శించారు. ఇటీవల గీసుకొండలో జరిగిన ఓ కార్యక్రమంలో కొండా సుస్మిత మాట్లాడుతూ.. రేవంత్ రెడ్డితో పాటు పార్టీ నాయకత్వంపై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఈ ఘటనపై టీపీసీసీ క్రమశిక్షణ సంఘం మంత్రి సురేఖకు షోకాజ్ నోటీసు జారీ చేసింది. దీనికి సురేఖ వివరణ ఇస్తూ, తన కూతురి వ్యాఖ్యలు ఆమె వ్యక్తిగత అభిప్రాయాలని, వాటికి రాజకీయంగా తాను బాధ్యత వహించాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు. తనపై జారీ చేసిన నోటీసును ఉపసంహరించుకోవాలని కోరారు.

అయితే, సురేఖ వివరణపై కాంగ్రెస్ ఎమ్మెల్యేలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. కాంగ్రెస్ శాసనసభా పక్షం వేదికగా సమావేశమై, సురేఖపై మూకుమ్మడిగా విరుచుకుపడ్డారు. పార్టీ అంతర్గత విషయాలను బహిరంగంగా మాట్లాడటం సరికాదని, సురేఖ వెంటనే తన కుమార్తె వ్యాఖ్యలను ఖండించి ప్రభుత్వానికి మద్దతుగా నిలవాలని డిమాండ్ చేశారు. సీనియర్ నేతలపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు.

ఈ వ్యవహారంపై టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ కూడా స్పందించారు. సుస్మిత వ్యాఖ్యలు పార్టీ నిబంధనలను అతిక్రమించాయని, దీనిని తీవ్రంగా పరిగణిస్తున్నామని స్పష్టం చేశారు. మరోవైపు, క్రమశిక్షణ కమిటీ అధ్యక్షుడు మల్లు రవి కూడా సుస్మిత వ్యాఖ్యలు అనుచితమని, మంత్రిగా ఉన్న సురేఖ వాటిని ఖండించకపోవడం తప్పని అన్నారు. శనివారం సమావేశమైన క్రమశిక్షణ కమిటీ.. సురేఖ వివరణ, వీడియో ఫుటేజీలను పరిశీలించి, తుది నిర్ణయం తీసుకోకుండా మరిన్ని సమావేశాలు నిర్వహించాలని నిర్ణయించింది.

# సూత్రధారులను గుర్తించాలి: కొండా సురేఖ

**హైదరాబాద్, నవతరం:** తెలంగాణ కాంగ్రెస్‌లో అంతర్గత విభేదాలు మరోసారి బహిర్గతమయ్యాయి. రాష్ట్ర మంత్రి కొండా సురేఖ టీపీసీసీ క్రమశిక్షణ కమిటీకి మరోసారి లేఖ రాశారు. కొందరు పార్టీ నేతలు ఉద్దేశపూర్వకంగా తనను, తన కుటుంబాన్ని లక్ష్యంగా చేసుకుని విమర్శలు చేస్తున్నారని ఆమె ఆ లేఖలో ఆవేదన వ్యక్తం చేశారు. తనపై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్న వారి వెనుక ఉన్న సూత్రధారులను గుర్తించి, వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కమిటీ ఛైర్మన్ మల్లు రవిని ఆమె కోరారు.

కమిటీ పంపిన నోటీసుకు తాను ఇప్పటికే వివరణ ఇచ్చానని కొండా సురేఖ ఈ సందర్భంగా గుర్తుచేశారు. ఒక అంశంపై విచారణ కొనసాగుతున్న తరుణంలోనే, సొంత పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులు, ఇతర నేతలు బహిరంగంగా విమర్శలు చేయడం సమంజసం కాదని, ఈ విషయాన్ని కమిటీ తీవ్రంగా పరిగణించాలని ఆమె తన లేఖలో పేర్కొన్నారు. కాగా, ఈ లేఖ రాయడానికి ముందు క్రమశిక్షణ కమిటీ ఛైర్మన్ మల్లు రవి ఈ అంశంపై స్పందించారు. కొండా సురేఖ సమర్పించిన వివరణపై కమిటీ ఇంకా ఎటువంటి నిర్ణయం తీసుకోలేదని ఆయన స్పష్టం చేశారు. అయితే,



ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై ఆమె కుమార్తె చేసిన వ్యాఖ్యలను ఒక బాధ్యతాయుతమైన మంత్రిగా సురేఖ ఖండించి ఉండాల్సిందని ఆయన అభిప్రాయపడ్డారు.

సహజ న్యాయ సూత్రాల ప్రకారం ఆ వ్యాఖ్యలతో తనకు సంబంధం లేదని కొండా సురేఖ వాదిస్తున్నట్లు మల్లు రవి పేర్కొన్నారు. ఇదే సమయంలో, ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి వ్యాఖ్యలకు సంబంధించిన వీడియోతో పాటు ఆయన ఇచ్చిన వివరణను కూడా పరిశీలించినట్లు వెల్లడించారు. ఇక కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి వ్యాఖ్యలపై తమకు ఇప్పటి వరకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని, దీనిని సుమోటోగా స్వీకరించాలా? వద్దా? అనే అంశంపై యోచిస్తున్నామని ఆయన వివరించారు.

## ఇకపై ఓన్లీ బ్లాక్‌బస్టర్లే..

# సినిమా నిర్మాణంపై బండ్ల గణేశ్ కీలక ప్రకటన!

- పూర్తి దృష్టి సినిమా నిర్మాణంపైనేనని ప్రకటించిన బండ్ల గణేశ్
- ఇకపై కేవలం బ్లాక్‌బస్టర్ చిత్రాలే తీస్తానని స్పష్టీకరణ
- ఇతర విషయాలపై, రాజకీయాలపై ఆసక్తి లేదని తేల్చిచెప్పిన వైనం
- గబ్బర్ సింగ్, బాద్‌షా వంటి హిట్ చిత్రాల నిర్మాతగా గుర్తింపు
- ఇటీవలే 'బీజీ బ్లాక్‌బస్టర్స్' పేరుతో కొత్త బ్యానర్ ప్రారంభ

**హైదరాబాద్, నవతరం:** ప్రముఖ సినీ నిర్మాత బండ్ల గణేశ్ మరోసారి పూర్తిస్థాయిలో చిత్ర నిర్మాణంపై దృష్టి సారించాడు. ఇకపై తన ప్రయాణం కేవలం సినిమాలతోనే ఉంటుందని, బ్లాక్‌బస్టర్ చిత్రాలను నిర్మించడమే తన ఏకైక లక్ష్యమని ఆయన స్పష్టం చేశాడు. మరే ఇతర అంశాలతోనూ తనకు సంబంధం లేదని పేర్కొంటూ శనివారం సోషల్ మీడియా వేదికగా ఒక ఆసక్తికర సందేశాన్ని పోస్ట్ చేశాడు. "ఇక నా దృష్టి, నా నిర్ణయం, నా ప్రయాణం అంతా సినిమా నిర్మాణంపైనే. ప్రస్తుతం నాకు మరే ఇతర విషయాలతోనూ సంబంధం లేదు. కేవలం బ్లాక్‌బస్టర్ చిత్రాలను నిర్మించాలనే గట్టి సంకల్పంతోనే ముందుకు సాగుతున్నాను. నా శ్రమ, సమయం, శక్తి అంతా ఇక సినిమాకే అంకితం" అని బండ్ల గణేశ్ తన పోస్టులో వెల్లడించాడు. మంచి సినిమాలు నిర్మించి, అఖండ విజయాలను అందుకోవడమే తన తదుపరి లక్ష్యమని ఆయన నొక్కిచెప్పాడు.

గతంలో బండ్ల గణేశ్ తన 'పరమేశ్వర ఆర్ట్ ప్రొడక్షన్స్' బ్యానర్‌పై పవన్ కల్యాణ్‌తో 'గబ్బర్ సింగ్', ఎన్టీఆర్‌తో 'బాద్‌షా', 'టెంపర్' వంటి భారీ విజయాలను అందుకున్నాడు. కొంతకాలంగా రాజకీయ పరమైన వ్యాఖ్యలతో నిరంతరం వార్తల్లో నిలుస్తున్న ఆయన, ఇటీవలే 'బీజీ బ్లాక్‌బస్టర్స్' (బండ్ల గణేశ్ బ్లాక్‌బస్టర్స్) పేరుతో నూతన నిర్మాణ సంస్థను ప్రారంభించాడు.



## ఉపాధ్యాయుని గుండెల్లో కాదు..
# ఈ వ్యవస్థ గుండెల్లో పడ్డ పోట్లు!



- పిల్లలు రాక్షసులుగా పుట్టడం లేదు.. మనమే వారిని అలా తయారు చేస్తున్నాం
- రుసుములు వసూలు చేసే గదులు ఉన్న బడిలో.. మనసు వినే గది ఏది?
- ప్రముఖ సామాజికవేత్త డాక్టర్ ఊలాల కోదండ రామ్ తో నవతరం విస్తృత ముఖాముఖి

**సోంపేట / ఇచ్ఛాపురం:** మన సమాజంలో తల్లిదండ్రుల తర్వాత అత్యంత ఉన్నతమైన స్థానం ఉపాధ్యాయుడిదే. తల్లి జన్మనిస్తే, గురువు జీవితాన్ని ఇస్తాడు. అందుకే మన వేదాలు, పురాణాలు గురువు విశిష్టతను ఎంతో గొప్పగా చెప్పాయి. 'మాతృదేవో భవ, పితృదేవో భవ, ఆచార్యదేవో భవ' అని తైత్తిరీయ ఉపనిషత్తు చెబుతోంది. తల్లి, తండ్రి తర్వాత ఆచార్యుడినే దైవంగా భావించమని దీని అర్థం. అలాగే మన పెద్దలు "గురుర్ బ్రహ్మ గురుర్ విష్ణుహు గురుర్ దేవో మహేశ్వరహు | గురుహు సాక్షాత్ పరబ్రహ్మ తస్మై శ్రీ గురవే నమహు || అజ్ఞాన తిమిరాంధస్య జ్ఞానాంజన శలాకయా | చక్షురున్మీలితం యేన తస్మై శ్రీ గురవే నమహు ||" అజ్ఞానం అనే చీకటిలో ఉన్న మన కళ్లను జ్ఞానం అనే కాటుకతో తెరిపించిన వాడే గురువు అని దీని భావం. అక్షరం దిద్దించి, అజ్ఞానం నుండి విజ్ఞానం వైపు నడిపించే గురువుకు మన సంస్కృతి దైవం కంటే ముందు స్థానం ఇచ్చింది. మాతా, పితా, గురు, దైవం అని గురువుకు దైవం కంటే ముందు స్థానం ఇచ్చింది. అలాంటి గురువునే ఇవాళ విద్యార్థులే దారుణంగా హత్య చేసే స్థితికి సమాజం దిగజారింది. నల్గొండ జిల్లా కొండమల్లేపల్లిలోని నాగార్జున పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రూపారెడ్డి ని తన సొంత పదవ తరగతి విద్యార్థులే కత్తిపోట్లతో పొడిచి చంపి, ఇంట్లో సొమ్ము దోచుకెళ్లడం ఈ పతనానికి పరాకాష్ట. గురువును చంపి డబ్బు కోసం పారిపోయేంతగా పిల్లల మనసు కలుషితం కావడం వెనుక కారణాలు ఏమిటి, ఈ వ్యవస్థ ఎటు పోతోంది అనే అంశంపై ఉత్తరాంధ్ర ప్రముఖ సామాజికవేత్త, విద్యావేత్త డాక్టర్ ఊలాల కోదండ రామ్ తో నవతరం జరిపిన సుదీర్ఘ ముఖాముఖి.

**నవతరం:** నమస్తే అయ్యా, కొండమల్లేపల్లి ఘటన విన్న తర్వాత మీ మొదటి స్పందన ఏమిటి?
**డా. కోదండ రామ్:** నాకు రెండు రోజులు నిద్ర పట్టలేదు సార్. నిజంగా గుండె పగిలింది. వేదం ఆచార్యుడిని దైవంగా చూడమంటే, మనం గురువునే డబ్బు కోసం చంపే స్థితికి వచ్చాం అంటే మనం ఎంత దిగజారామో అర్థం చేసుకోండి. ఇది ఒక హత్యగా నేను చూడటం లేదు, ఇది ఒక హెచ్చరిక, ఒక గుణపాఠం. ఈ సమాజం ఎటు పోతోందో చెప్పే అద్దం. మనం పిల్లల్ని కోల్పోలేదు, మన వేదాలు, పురాణాలు, ఇతిహాసాలు చెప్పిన విలువల్ని కోల్పోయాం. ఎన్నో పోట్లు పడ్డాయి అంటున్నారు, ఆ పోట్లు ఆ ఉపాధ్యాయుని గుండెల్లో పడలేదు, ఈ దేశం ఇన్నాళ్లుగా నమ్ముకున్న గురు - శిష్య సంబంధం గుండెల్లో, ఈ సమాజపు నైతికత గుండెల్లో పడ్డాయి. ఈ నేరం చేసింది ఆ ఇద్దరు పిల్లలు కాదు, ఈ వ్యవస్థ చేసింది.

**నవతరం:** అధికారులు గంజాయి, మద్యం, అంతర్జాల వీడియోల ప్రభావం అంటున్నారు, మీరేమంటారు?
**డా. కోదండ రామ్:** అది నిజమే, కానీ అది ఫలితం, కారణం కాదు. పిల్లవాడు చెడిపోవడానికి గంజాయి కారణం కాదు.. చెడిపోయే దారి వదిలేసిన మనమే కారణం. చలనచిత్రంలో కథానాయకుడు పొగ తాగుతూ, మద్యం తాగుతూ, కత్తి పట్టుకుని గొప్పవాడు అవుతుంటే.. జాలగూడు ధారావాహికల్లో హత్యలే వినోదంగా, అత్యాచారాలే కథలుగా, జూదం, పందెం అనువర్తనాలే గొప్పతనంగా చూపిస్తుంటే.. పిల్లవాడు దాన్నే నిజం అనుకుంటాడు. మనం వాడి చేతిలో భగవద్గీత పెట్టాలి, రామాయణ, భారత కథలు చెప్పాలి, కానీ చేతి పరికరాన్ని పెడుతున్నాం. వాడి జేబులో విషాన్ని పెట్టి, వాడు విషం తాగాడని ఏడిస్తే ఏం లాభం? ప్రభుత్వాలు ఈ విషపు సంస్కృతిని అరికట్టాలి. సినిమాలో హింసను గొప్పగా చూపడాన్ని నియంత్రించాలి. పందెం అనువర్తనాలను నిషేధించాలి.

**నవతరం:** మరి ఈ నేరంలో చదువుల వ్యవస్థ పాత్ర ఎంత ఉంది?
**డా. కోదండ రామ్:** నూటికి నూరు శాతం ఉంది. ఇవాళ బడి అంటే ఏమిటి? ఒక అంగడి, ఒక వ్యాపార కేంద్రం. రుసుము కట్టే గది ఉంది, దుస్తులు అమ్మే గది ఉంది, పుస్తకాలు అమ్మే గది ఉంది. కానీ పిల్లవాడి మనసు వినే మానసిక నిపుణుడి గది ఏ బడిలో ఉంది చెప్పండి? ఏ ఒక్క వ్యాపార పాఠశాలలో అయినా ఉందా? లేదు. పుట్టగొడుగుల్లా వీధికో బడి వచ్చింది. అక్కడ చదువు చెప్పరు.. మార్కులు అమ్ముతారు, తరగతులు అమ్ముతారు, భవిష్యత్తును అమ్ముతారు. పిల్లవాడు మనిషిగా ఎదగడం గురించి, వాడి ఆనందం గురించి, వాడి బాధ గురించి ఎవడికీ పట్టదు. చదువు అంటే లెక్కలు, విజ్ఞానం తప్ప మానవ సంబంధాలకు, నైతిక విలువలకు, మన సంస్కృతికి తావులేదు. ఈ వ్యవస్థ పిల్లల్ని మనుషులుగా కాదు, మార్కులు తెచ్చే యంత్రాలుగా చూస్తోంది.

**నవతరం:** తల్లిదండ్రుల పెంపకంలో కూడా లోపం ఉందంటారా?
**డా. కోదండ రామ్:** ఖచ్చితంగా ఉంది. ఇవాళ తల్లిదండ్రులకు పిల్లలతో గడిపే తీరిక లేదు. ఆడుతూ పాడుతూ, చెట్లు ఎక్కుతూ, గుడి చుట్టూ తిరుగుతూ గడపాల్సిన బాల్యాన్ని మనం పరుగు పందెం చేశాం. తెల్లవారు ఐదు గంటల నుండి రాత్రి పది గంటల వరకు పరుగు. వసతి గృహంలో ఒంటరితనం. ఇంట్లో ఉంటే చేతి పరికరంతో ఒంటరితనం. పిల్లవాడికి తల్లి ఒడి కావాలి, తండ్రి భుజం కావాలి. కానీ మనం చేతి పరికరం ఇస్తున్నాం. క్రమశిక్షణ పేరుతో వ్యాపార పాఠశాలల్లో అందరి ముందు అవమానించడం, కొట్టడం, తిట్టడం సర్వసాధారణం అయిపోయింది. పిల్లవాడు పది మంది ముందు అవమానం భరించలేడు. ప్రేమ లేని చోట కోపం పుడుతుంది, గౌరవం లేని చోట కసి పుడుతుంది. ఆ కసే ఇవాళ కత్తి అయింది. తల్లిదండ్రులు పిల్లలకు మార్కులు కాదు, సమయం ఇవ్వాలి, ప్రేమ ఇవ్వాలి, కథలు చెప్పాలి.

**నవతరం:** ఆంగ్లేయుల నాటి చదువుల విధానమే ఇంకా కొనసాగుతోందని మీరు తరచూ అంటుంటారు?
**డా. కోదండ రామ్:** అవును. మెకాలే చచ్చిపోయాడు, కానీ వాడి ఆత్మ మన వ్యాపార పాఠశాలల్లో తిరుగుతోంది. మెకాలేకు కావలసింది తెల్ల దొరలకు సేవ చేసే గుమాస్తాలు, అంటే బానిసలు. ఇవాళ మన వ్యాపార చదువుకు కావలసింది విదేశాలకు సేవ చేసే కూలీలు. ఇద్దరికీ మన చరిత్ర, మన సంస్కృతి, మన మానవ సంబంధాలు, మన భాష, మన వేద విజ్ఞానం అక్కర్లేదు. అందుకే విజ్ఞానం ఉంది, లెక్కలు ఉన్నాయి.. కానీ మానవత్వం లేదు. మార్కులు వస్తున్నాయి, మనుషులు రావడం లేదు. కొఠారి సంఘం అరవై ఏళ్ల క్రితమే చెప్పింది.. భారతీయ చదువును పూర్తిగా మన ప్రజల చరిత్ర, సంస్కృతి, అవసరాలకు అనుగుణంగా పునర్నిర్మించాలి, దానికోసం ఒక విప్లవమే రావాలి అని. అన్ని వర్గాల పిల్లలు ఒకే చోట చదివే సామాన్య బడి విధానం తెమ్మంది. కానీ పాలకులు ఆ విలువైన సూచనలను పక్కన పెట్టి, చదువును అంగడి సరుకు చేశారు.

**నవతరం:** పిల్లల్లో జూదం, మత్తు పదార్థాల వ్యసనం పెరగడానికి కారణం ఏమిటి?
**డా. కోదండ రామ్:** మూడు కారణాలు. ఒకటి ఖాళీతనం, రెండు ఒంటరితనం, మూడు లక్ష్యం లేకపోవడం. పిల్లవాడికి ఆట లేదు, పాట లేదు, కథ లేదు, కబుర్లు లేవు. బడి అయిపోతే చేతి పరికరం. దానిలో జూదం, అశ్లీలం, హింస. ఇవన్నీ ఉచితంగా దొరుకుతున్నాయి. ఒకప్పుడు సాయంత్రం అయితే ఊరి బయట ఆటలు, గుడిలో భజనలు, ఇంట్లో తాత చెప్పే కథలు ఉండేవి. ఇవాళ అవన్నీ పోయి చేతి పరికరం వచ్చింది. ప్రభుత్వాలు పందెం అనువర్తనాలను వెంటనే నిషేధించాలి. పాఠశాలల్లో ఆటలు, కళలు, సాంస్కృతిక కార్యక్రమాలు, యోగా, ధ్యానం తప్పనిసరి చేయాలి. పిల్లవాడి శక్తిని మంచి వైపు మళ్లించాలి. లేకపోతే ఆ శక్తి ఇలాగే విధ్వంసం వైపు మళ్లుతుంది.

**నవతరం:** ప్రభుత్వం తక్షణమే ఏం చేయాలి?
**డా. కోదండ రామ్:** నాలుగు పనులు వెంటనే చేయాలి. ఒకటి - చదువును వ్యాపారం కాకుండా చేయాలి. చదువును పూర్తిగా ప్రభుత్వ ఆధీనంలోకి తేవాలి. పేదవాడి బిడ్డా, కోటీశ్వరుడి బిడ్డా ఒకే చాప మీద కూర్చునే సామాన్య బడి రావాలి. రెండు - ప్రతి బడిలో ఒక మనస్తత్వవేత్త, ఆరోగ్య కార్యకర్త తప్పనిసరిగా ఉండాలి. లెక్కల ఉపాధ్యాయుడు ఎంత ముఖ్యమో, మనస్తత్వవేత్త అంతే ముఖ్యం. మూడు - చదువు అంటే బ్రతకడం నేర్పాలి. ఒత్తిడిని తట్టుకోవడం, ఓటమిని అంగీకరించడం, మనిషిని ప్రేమించడం, సాటి మనిషిని గౌరవించడం నేర్పాలి. నాలుగు - ఉపాధ్యాయులకు రక్షణ కల్పించాలి, వారికి బోధన తప్ప ఇతర పనులు అప్పగించకూడదు.

**నవతరం:** ఉపాధ్యాయులు కూడా మారాల్సిన అవసరం ఉందా?
**డా. కోదండ రామ్:** ఉంది. ఉపాధ్యాయుడు అంటే కేవలం పాఠం చెప్పేవాడు కాదు, జీవితం చెప్పేవాడు. దండించడం కాదు, దగ్గరకు తీసుకోవడం నేర్చుకోవాలి. పిల్లవాడు తప్పు చేస్తే ఎందుకు చేశాడో తెలుసుకోవాలి. ఒక్క మాటతో పిల్లవాడి జీవితం మార్చవచ్చు, ఒక్క దెబ్బతో జీవితాన్ని నాశనం చేయవచ్చు. గురువు అంటే భయం కాదు, భరోసా కావాలి. పిల్లవాడు తన బాధ చెప్పుకునే ధైర్యం గురువు దగ్గర ఉండాలి.

**నవతరం:** చివరగా సమాజానికి మీ సందేశం?
**డా. కోదండ రామ్:** పిల్లల్ని తిట్టకండి, కొట్టకండి, వారిని అర్థం చేసుకోండి. వారు నేరస్థులు కాదు, బాధితులు. ఈ వ్యవస్థ బాధితులు, ఈ సమాజ బాధితులు. వారికి మార్కుల పట్టిక కంటే, మనసు పట్టిక ముఖ్యం అని గుర్తించండి. మీ పిల్లలతో రోజుకు ఒక గంటైనా మాట్లాడండి, వారి కళ్లలోకి చూడండి, వారి మనసులో ఏముందో తెలుసుకోండి. పిల్లలు ఈ సమాజపు దీపాలు. ఆ దీపాలను ఆర్పేస్తే చీకట్లో మిగిలేది మనమే. వేదం చెప్పినట్టు గురువును దైవంగా భావించే సంస్కృతిని తిరిగి తేవాలి. అప్పుడే ఇలాంటి ఘటనలు పునరావృతం కావు

### ఇందిరా మహిళా శక్తి చీరలు పంపిణీ చేసిన కాంగ్రెస్ నాయకులు
## గుమస్తా మధుసూదన్





**కుత్బుల్లాపూర్, నవతరం:** కుత్బుల్లాపూర్ నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు కూన శ్రీశైలం గౌడ్ ఆదేశాల మేరకు... 279 రోడమేస్త్రీ నగర్ డివిజన్ ఎన్టీఆర్ నగర్ లో శనివారం నాడు కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన ఇందిరా మహిళా శక్తి చీరల పంపిణి కార్యక్రమంలో 279 రోడమేస్త్రీ నగర్ డివిజన్ అధ్యక్షులు గుమస్తా మధుసూదన్, ఎక్స్ కో ఆప్షన్ సభ్యులు రషీద్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కుత్బుల్లాపూర్ యూత్ కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ సాయి, డివిజన్ నాయకులు రఘు రెడ్డి, నాయుకులు రజాక్, షబ్బీర్, మొయిన్, ప్రవీణ్, నర్సింహా, తదితరులు పాల్గొన్నారు.

## మానవత్వమే మా సేవా ధ్యేయం

**పటాన్చెరు, నవతరం:** ఒకేరోజు ఇద్దరు అనాథలకు అంత్యక్రియలు నిర్వహించింది ఎండీఆర్ ఫౌండేషన్. పటాన్చెరు పట్టణంలోని ఎం.జీ రోడ్ మహంకాళి దేవాలయం వద్ద అనారోగ్యంతో రోడ్డుపై ఉన్న ఓ వ్యక్తిని స్థానికుల సమాచారంతో ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందారు. అదేవిధంగా పటాన్చెరు బస్టాండ్ వద్ద రోడ్డు దాటుతుండగా ద్విచక్ర వాహనం ఢీకొని ఓ వృద్ధుడు మృతి చెందారు. వీరిద్దరి వివరాలు తెలియకపోవడంతో పాటు, వారి కుటుంబ సభ్యులు లేదా బంధువులు ఎవరూ ముందుకు రాకపోవడంతో ఎండీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఇద్దరికీ గౌరవప్రదంగా అంత్యక్రియలు నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఫౌండేషన్ సభ్యులు మాట్లాడుతూ.. ఎవరూ లేని వారికి మేమున్నాం... అంతిమ ప్రయాణంలోనూ ఆత్మీయతను అందించడమే ఎండీఆర్ ఫౌండేషన్ లక్ష్యమన్నారు.





## గంజాయి గ్యాంగ్ అరెస్ట్
### 22 కిలోల గంజాయి చాక్లెట్లు స్వాధీనం

**జగద్గిరిగుట్ట, నవతరం:** విశ్వసనీయ సమాచారం మేరకు ఎస్వోటీ కుత్బుల్లాపూర్, జగద్గిరిగుట్ట పోలీసులు సంయుక్తంగా మహదేవపురం, జగద్గిరిగుట్ట నందు ప్రత్యేకంగా తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో జగద్గిరిగుట్టకు చెందిన ముగ్గురు మగ వ్యక్తులు (బురానీ కమల్ సింగ్, బడ్డ నేపాల్ సింగ్, బడ్డ దీపక్ సింగ్), మహారాష్ట్ర నాందేడ్ కు చెందిన జ్యోతి కౌర్ అలియాస్ కాలీ అనే నల్గురు వ్యక్తులు అక్రమంగా రవాణా చేస్తున్న సుమారు 22 కిలోల గంజాయి చాక్లెట్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. గంజాయి చాక్లెట్లను అక్రమంగా తరలిస్తున్న నల్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటనకు సంబంధించి కేసు నమోదు చేసి, గంజాయి చాక్లెట్లను ఎక్కడి నుంచి తీసుకువచ్చారు, ఎక్కడికి తరలిస్తున్నారు, ఈ అక్రమ రవాణా వెనుక మరెవరెవరి ప్రమేయం ఉంది అనే అంశాలపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. మాదకద్రవ్యాల అక్రమ రవాణా, విక్రయం మరియు వినియోగానికి పాల్పడే వారిపై కఠినమైన, చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు. మాదకద్రవ్యాల నిర్మూలనలో భాగంగా ఇటువంటి అక్రమ కార్యకలాపాలపై నిరంతరం నిఘా కొనసాగిస్తామని పేర్కొన్నారు.



Owned and Published by Sirigiri Varadaraju, RNI No: APTEL/2018/76747, Dr. Narsimlu Yellampally (B.Tech, MBA, Journalism (NiMA) - Bureau Chief, Telangana, 9618907705,
E-mail: pressmanbharat@gmail.com, Telangana State Office: Plot No. A/9, Phase -I, Alwyn Colony, Kukatpally, Hyderabad - 72, Telangana, India. website: https://epaper.navatharam.com